www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 20 ఏప్రిల్ 2025
5
అన్నమయ్య





ఉద్యోగులు, విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న కలెక్టర్ శ్రీధర్

పేదల గూడు..పూర్తయ్యేదెన్నడో?



రోడ్డుకు నోచుకోని నారాయణరెడ్డిగారిపల్లె కాలనీ

- **నత్తనడకన ఇళ్ల నిర్మాణాలు**
- **76,595 ఇళ్లకు 37,862 మాత్రమే పూర్తి**
- **పేదల సొంతింటి కల నెరవేరేనా?**
- **కాలనీల్లో తాగునీటి సమస్య**

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేదలు గృహాలు నత్తనడకన నిర్మాణ పనులు సాగుతున్నాయి. పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయింది. జిల్లాలో గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో పేదలకు గృహాలను మంజూరు చేశారు. అన్నమయ్య జిల్లాలో వ్యాప్తంగా 76,595 గృహాలు మంజూరు కాగా 37,862 గృహాలు పూర్తయ్యాయి. 29,742 వివిధ దశలలో ఉన్నాయి. 8,991 గృహాలు ఇప్పటివరకు మొదలు పెట్టలేదు. 331 లే అవుట్ కాలనీలు ఏర్పాటు చేశారు. లే అవుట్ కాలనీలోని గృహ నిర్మాణాలు అన్నీ కూడా పట్టణానికి చాలా దూరంగా ఉండడంతో అక్కడ మౌలిక వసతులు లేక తాగునీటి వసతి లేకపోవడంతో నివాసితులు మనోవేదనకు గురవుతున్నారు. చీకటి పడిందంటే సంచారం ఎక్కువగా ఉంది. అప్పటి ప్రభుత్వం వేసిన వీధిలైట్లను కొందరు ఎక్కడికి అక్కడ తీసుకెళ్ళిపోవడంతో చీకటి పడిందంటే ఆ ప్రాంతమంతా అంధకారంలో ఉంది. ఆనాడు ప్రభుత్వం జగనన్న కాలనీలో సిసి రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, తాగునీరు సౌకర్యాలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, బడి, గుడి, అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని హామీలు కూడా ఇచ్చారు. ఆ హామీలు ఏమాత్రం నెరవేరకపోవడంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన ప్రజా సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదు. రాయచోటి పట్టణానికి సమీపంలోని నారాయణరెడ్డిగారిపల్లె దగ్గర జగనన్న కాలనీని ఆరు వేల కుటుంబాల వారికి ప్రభుత్వం స్థలాలను పంపిణీ చేశారు. ఇక్కడ దాదాపు 600 కుటుంబాలు నివాసం ఉన్నారు. అప్పటి ప్రభుత్వం ప్రజల దాహార్తిని తీర్చేందుకు 40 బోర్లు వేసినప్పటికీ కేవలం కాలనీ మొత్తంలో ప్రస్తుతం రెండు బోర్లు మాత్రమే పనిచేస్తున్నాయి. ఈ రెండు బోర్ల నుండి వచ్చే నీటిని అక్కడ ప్రజలు పట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ కాలనీలో 6513 గృహాలు మంజూరైనాయి. అందులో పది బ్లాకులు గాను ప్రభుత్వ విభజించింది. నీటి నిల్వ కోసం పెద్దపెద్ద ట్యాంకులను నిర్మించకుండా కేవలం చిన్నపాటి ట్యాంకులను మాత్రమే ప్రతి వీధి చివర్లో మధ్యలో ఏర్పాటు చేశారు. అవి కూడా నీరు లేక ఎల్లవేళల పోతున్నాయి. పిల్లలు చదువుకోవాలంటే రాయచోటికి వచ్చి చదువుకోవాల్సిన పరిస్థితి ఉంది ఇక చిన్న పిల్లలకు సంబంధించి అంగన్వాడీ కేంద్రం లేకపోవడంతో పిల్లలందరూ చదువుకుని నోచుకోక కేవలం ఇంటి పట్టునే ఉండే పరిస్థితి నెలకొంది. ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే ఆటోలు పట్టుకొని రాయచోటి ప్రాంతానికి రావాల్సి వస్తున్నది ఆరు కిలోమీటర్లు ప్రయాణించి రాయచోటికి వచ్చి వైద్య సేవలు పొందాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. ప్రభుత్వం ఈ కాలనీకి గతంలో మాట ఇచ్చిన ప్రకారం బస్సు సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన మాట నేడు కేవలం ఉదయం, సాయంత్రం రెండు పూటలు మాత్రమే బస్సు రావడంతో ప్రజలు ఆ సమయాల్లో సకాలంలో అందుకు అందుబాటు లేకపోవడంతో ఆటోలు ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆటోలో రావాలంటే రూ.వంద ఇస్తే గాని అక్కడి నుండి ఇక్కడికి రాలేని పరిస్థితి ఉందని లబ్ధిదారులు వాపుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధుల, సంబంధ అధికారులు స్పందించి కాలనీలో నీటి వసతి, మౌలిక సదుపాయాలను కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నియోజకవర్గాల వారీగా ఇళ్ల నిర్మాణాలు...

రాయచోటి నియోజకవర్గంలో 19,020 గృహాలు మంజూరు కాగా 8,597 పూర్తయ్యాయి. 8,500 వివిధ దశలలో ఉన్నాయి. 1923 గృహాలు ఇప్పటివరకు మొదలు పెట్టలేదు. పీలేరులో 11,956 గృహాలు మంజూరు గాక 6,713 పూర్తయ్యాయి. 4,726 వివిధ దశలలో ఉన్నాయి. 517 ఇక్కడ వరకు మొదలుపెట్టలేదు ఇప్పటివరకు మొదలుపెట్టలేదు. రాజంపేటలో 10,758 గృహాల మంజూరు కాగా 4,623 గృహాలు పూర్తయ్యాయి. 4,334 గృహాలు వివిధ దశలలో ఉన్నాయి. 1,801 ఇప్పటివరకు మొదలు పెట్టలేదు. రైల్వేకోడూరులో 6,559 గృహాల మంజూరు కాగా 3,062 పూర్త య్యాయి. 1732 వివిధ దశలలో ఉన్నాయి. 1,765 ఇప్పటివరకు మొదలు పెట్టలేదు. తంబళ్లపల్లెలో 13,131 గృహాల మంజూరు కాగా 6,586 పూర్తయ్యాయి. 4,256 వివిధ దశలలో ఉన్నాయి. 2,289 ఇప్పటివరకు మొదలు పెట్టలేదు. మదనపల్లి నియోజకవర్గంలో 15,171 గృహాలను మంజూరు కాగా 8,282 పూర్తయ్యాయి. 6,194 వివిధ దశల్లో ఉన్నాయి.696 ఇప్పటివరకు మొదలు పెట్టలేదు.

రాత్రివేళల ఇబ్బందిగా ఉంది



గతంలో విద్యుత్ స్తంభాలకు లైట్లు బిగించారు. అవి ఎవరో కొన్ని తీసుకెళ్లారు. కొన్ని లైట్లు పనిచేయడం లేదు. రాత్రి వేళలో చీకటితో ఇబ్బందిగా ఉంది. రాత్రి వేళలో దొంగతనాలు కూడా జరుగుతున్నాయి.

- శిరీష, లబ్ధిదారు, రాయచోటి.

మౌలికి వసతులు కల్పించాలి



జగనన్న కాలనీలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ, అంగన్వాడీ, ఆసుపత్రి ఏర్పాటు చేయాలి. ఏదైనా వస్తువులు కావాలంటే రాయచోటికి వెళ్లాల్సిందే.రాయచోటి కి దాదాపు 6 కిలో మీటర్లు వస్తుంది. ఆటోలుకు పూయి రావడానికి రెండు వందలు ఖర్చవుతుంది. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండడం వలన ఉన్నటువంటి నీరు సరిపోవటం లేదు.నూతనంగా బోర్లు వేసి త్రాగు నీటిని సరఫరా చేయాలి.

- శేఖర్, లబ్ధిదారుడు, రాయచోటి.

కాలనీల అభివృద్ధికి చర్యలు



జిల్లాలో లేఅవుట్ కాలనీలో మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నాం. కాలనీలలో వీధిలైట్లు ఏర్పాటు చేశాం. ప్రస్తుతం వేసవి కాబట్టి నీటి సమస్య ఉంది. ఈ సమస్యలపై ఉన్నత అధికారులతో మాట్లాడాం. త్వరలో జల్ జీవన్ ద్వారా నీటిని సౌకర్యం కల్పిస్తాం. బిల్లులు కూడా సకాలంలో చెల్లిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా పక్క గృహాల లక్ష్యాన్ని పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- శివయ్య హౌసింగ్ పీడీ, రాయచోటి.

వ్యర్థాల తొలగింపుపై అవగాహన అవసరం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ఎలక్ట్రానిక్ వ్యర్థాల శాస్త్రీయ తొలగింపుపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని, ఎస్‌హెచ్‌జి గ్రూపుల ద్వారా ఈ-వ్యర్థాల సేకరణ జరుగుతుందనికలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శనివారం ఉదయం పట్టణంలోని ఏరియా ఆసుపత్రి వద్ద 'ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించడం' అనే కార్యక్రమం పై నిర్వహించిన అవగాహన ర్యాలీలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమాలు నిర్వస్తామన్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ నెల మూడో శనివారం ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించడం అనే థీమ్‌తో అన్నమయ్య జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారని పేర్కొన్నారు. అన్ని రకాల వ్యర్థాల తొలగింపుపై ప్రజల్లో అవగాహన ఉండాలని, ముఖ్యంగా ఈ శతాబ్దంలో ఎక్కువగా ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్ వస్తువుల వ్యర్థాల శాస్త్రీయ తొలగింపుపై ప్రత్యేక అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు. వ్యర్థాల తొలగింపులో 'రెడ్యూస్, రియూస్, రీసైకిల్' అనే 'ఆర్ఆర్ఆర్' సిద్ధాంతాన్ని ప్రజలందరూ అవలంభించుకోవాలన్నారు. అన్నమయ్య జిల్లాలోని 4 మున్సిపాలిటీలు, పెద్ద పంచాయతీలలో రోజూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ ఉంటుందని తెలిపారు. మిగిలిన పంచాయతీలలో వారానికి ఒకసారి లేదా నెలకు ఒకసారి ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరిస్తారని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువుల రీసైక్లింగ్ ద్వారా ఆదాయాన్ని సంపాదించొచ్చు అన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణపై ఎస్‌హెచ్‌జి గ్రూపులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నామని వారి ద్వారా ప్రజల దగ్గర నుంచి ఈ-వ్యర్థాలను సేకరిస్తున్నామని చెపాపరు. రాయచోటి మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన ఈ -వేస్ట్ మేనేజ్మెంట్ కేంద్రంలో ఈరోజు 170 కిలోల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరిస్తారని చెప్పారు. సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ప్రయివేటు కంపెనీలకు అందించి రీసైకిలింగ్ చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ నిర్మాణంలో అందరం భాగస్వాముల మోతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, రాయచోటి మునిసిపల్ కమిషనర్ వాసు పాల్గొన్నారు.

అటవీ అధికారులపై చర్యలేవీ..? : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

పొన్నూటిపాలెం గ్రామ పరిధిలోని అటవీ భూముల్లో ఈ నెల 16న ఉచ్చులో చిక్కుకుని మరణించిన సంఘటనను మసి పూసి మారేడు చేసిన చందంగా అటవీ అధికారుల వైఖరి ఉందని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక అటవీశాఖ కార్యాలయం ముందు పొన్నూటిపాలెం గ్రామ రైతులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆ గ్రామ ప్రజలు ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీనివాసులు పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ అడవి జంతువులను వేటాడే వాళ్ళతో అటవీ అధికారులకు సత్సంబంధాలు ఉన్నాయని, ఎవరు ఎక్కడ ఉచ్చు బిగిస్తారో వారికే తెలుసని వివరించారు. గత 10నెలలు గా చిరుత సంచరిస్తోందని రైతులు పదే పదే చెప్పినా ఏమి ఎరగనట్లే అటవీ శాఖ వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిరుత చనిపోయిన సంఘటనలో అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా తెలుస్తున్నా, ఒక్క అధికారిపై కూడా చర్యలు తీసుకోకపోవడంలోని అంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రాథమిక విచారణ కూడా జరపకుండా 24 గంటల్లోనే చిరుత మరణించిన ప్రాంతంకు చుట్టుపక్కల భూములు ఉన్న రైతులను అరెస్టు చేసేసి చేతులు దులుపుకోవడం సిగ్గుచేటన్నారు. చిరుత మరణించిడంలో నిర్లక్ష్యంగా ఉన్న మదనపల్లె ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, జిల్లా ఫారెస్ట్ అధికారి, బీట్ ఆఫీసర్ లకే విచారణ అధికారులుగా ఉంటే న్యాయం ఎవరిపక్షామో అర్థం చేసుకోవచ్చని అన్నారు. చిరుత మరణించడంలో నిర్లక్ష్యంగా ఉన్న మదనపల్లె ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ను సస్పెండ్ చెయ్యాలని, జిల్లా ఫారెస్ట్ అధికారి, బీట్ ఆఫీసర్‌లపై చర్యలు తీసుకోవాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివెయ్యాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా దర్యాప్తు చేసి ఉచ్చు పన్నిన అసలైన నిందితులను గుర్తించి అరెస్టు చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు, పొన్నూటిపాలెం ప్రజలు పాల్గొన్నారు.

ఆరోగ్య ధృవపత్రాలు సమర్పించాలి : డిఇఒ

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు ఉత్తర్వుల మేరకు ఈ సంవత్సరంలో జరగబోయే ఉపాధ్యాయ బదిలీలలో ప్రతిపాదిత మార్గదర్శకాల ప్రకారం, బదిలీల కోసం ఉపాధ్యాయులు ప్రాధాన్యత కలిగినవారిగా పరిగణించబడతారని, వారు తప్పనిసరిగా కడపలో రిమ్స్ ఏర్పాటు చేసిన అదనపు డైరెక్టర్లు, వైద్య విద్యా సూపరింటెండెంట్ల వద్ద26వ తేదీలోపల ఆరోగ్య ధృవపత్రాలు జారీ చేస్తారని సంబందిత ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ధ్రువపత్రాలు పొందాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ శారీరకంగా వికలాంగులు 80 శాతం లేదా అంతకంటే ఎక్కువ దృష్టి లోపం కలిగిన, శారీరకంగా సవాలు చేయబడిన, ఆర్థోపెడికల్లీ సవాలు చేయబడిన ఉద్యోగులున్నారని పేర్కొన్నారు. శారీరకంగా వికలాంగులు 70 శాతం వరకు దృష్టి లోపం కలిగిన, శారీరకంగా సవాలు చేయబడిన, ఆర్థోపెడికల్లీ సవాలు చేయబడిన, వినికిడి లోపం ఉన్న ఉద్యోగులు, వైద్య కారణాలపై గుండెలో రంధ్రం పూడ్చడం, గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స, అవయవ మార్పిడి, పెద్ద నాడీ శస్త్రచికిత్స, ఎముక క్షయ, టిడి, కిడ్నీ మార్పిడి, డయాలసిస్, వెన్నెముక శస్త్రచికిత్స, పూర్తిగా మానసికంగా, శారీరకంగా సవాలు చేయబడిన పిల్లలు, జీవిత భాగస్వామి ఉన్న ఆధారపడిన ఉద్యోగులు, చికిత్స పొందుతున్నవారని పేర్కొన్నారు. జువెనైల్ డయాబెటిస్, లాసెమియా వ్యాధి, హీమోఫీలియా వ్యాధి, కండరాల క్షీణతతో బాధపడుతున్న, చికిత్స పొందుతున్న ఆధారపడిన పిల్లలు ఉండాలన్నారు. పుట్టుకతో గుండె సంబంధిత వ్యాధులు (గుండెలో రంధ్రాలు) కలిగి ఉండి, శస్త్రచికిత్స చేసిన ఆధారపడిన పిల్లలను శస్త్రచికిత్స చేసిన తేదీ నుండి మూడు (3) సంవత్సరాలలోపు ప్రాధాన్యతా వర్గంగా పరిగణించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల బదిలీలు-2025 ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించబోతోందని తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో వివరణాత్మక మార్గదర్శకాలు త్వరలో జారీ చేస్తారని తెలిపారు. ఆరోగ్య కారణాలపై బదిలీ కోరుకునే ఉపాధ్యాయులు సంబంధిత జిల్లా వైద్య మండలి (ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యాయులు చిత్తూరు ఎస్‌విఆర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, తిరుపతి నుండి, ఉమ్మడి కడప జిల్లా ఉపాధ్యాయులు అయితే కడప-ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, కడప) నుండి తాజా వైద్య ధృవపత్రాలను పొందాలని తెలిపారు.

'స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ స్పష్టం చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిమ్మనపల్లె మండల వైసిపి నూతన కమిటీ నాయకులు సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం కష్టపడే నిమ్మనపల్లె మండల నాయ కులు కష్ట సమయంలో పార్టీని అంటిపెట్టుకుని వున్నారని, వారికి ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. త్వరలో స్థానిక సంస్థలు ఎన్నికలు జరుగునున్న నేపథ్యంలో అందరూ సమష్టిగా పనిచేసి ఎంపిటిసి, జడ్‌పిటిసి స్థానాలను కైవసం చేసుకుని జగనన్నకు కానుకగా ఇద్దా మన్నారు. నిమ్మనపల్లె మండల నాయకులు మాట్లాడుతూ కమిటీలలో స్థానం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్‌రెడ్డి, పార్టీ పెద్దలకు తమ నియామకం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. తమకు అప్పగించిన పదవులకు న్యాయం చేస్తామని ప్రకటించారు. మదనపల్లె నియోజకవర్గంలో వైసిపిని గెలిపిస్తామని, నిస్సార్ అహమ్మద్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో మండల అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యక్షుడు డవ్ నాగరాజ, బూత్ కమిటీ కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ యోగానంద రెడ్డి, కార్యదర్శి ఖాదర్ బాషా, ఉపాధ్యక్షుడు రాజగోపాల్, రైతు విభాగ అధ్యక్షుడు విజయ్ భాస్కర్ రెడ్డి (బాబు), విద్యార్థి విభాగం ప్రశాంత్, కో-ఆప్షన్ సభ్యురాలు శారద రెడ్డి, నాగమణి, బిసి సెల్ రమేష్ బాబు, రామయ్య, చేనేత విభాగం రెడ్డి ప్రసాద్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



నేలకొరిగిన అరటి పంటలను పరిశీలిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గాలివానలకు దెబ్బతిన్న పంట పొలాలకు నష్టపరిహారం అందించి రైతుల పక్షాన కూటమి ప్రభుత్వం నిలబడుతుందని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. శనివారం కొల్లావారిపల్లె, మిట్టమీదపల్లి, శవనవారిపల్లెలో దెబ్బతిన్న పంట పొలాలను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని, రైతులకు అందించే నష్టపరిహారం ప్రభుత్వాదేశాల ప్రకారం అందుతుందని పేర్కొన్నారు. బీమా కూడా త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి రైతు తల ఎత్తుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. చేతికొచ్చిన బిడ్డను కోల్పోతే తల్లిదండ్రులకు ఎంత బాధ కలుగుతుందో చేతికి వచ్చిన పంట నేలపాలైతే రైతుకు అంతే బాధ కలుగుతుందని, అటువంటి రైతు బాధ తెలిసిన ప్రభుత్వం రాష్ట్రంలో ఉమ్మడి ఎన్‌డిఎ ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. నష్టపోయిన ప్రతి రైతు వెంటనే కోలుకునేలా ప్రభుత్వం నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పీర్ మున్నితో పాటు వివిధ శాఖల అధికారులు, రైతులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు హార్సిలీహిల్స్‌లో రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-మదనపల్లె

ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ 11వ రాష్ట్ర సదస్సు ఆదివారం హార్సిలీహిల్స్‌లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ ఎ.వి.సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తాను పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని మదనపల్లె అప్నా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 600 మంది డాక్టర్లు హాజరవుతున్నారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల ప్రయివేట్ హాస్పిటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరవుతారని తెలిపారు.

గాయపడిన కార్మికుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పీలేరు

విధి నిర్వహణలో గాయపడ్డ పారిశుధ్య కార్మికుడికి ఇఒ వై.గురు మోహన్ ఆర్థిక సాయం అందించారు. పీలేరు గ్రామ పంచాయతీలో సుమారు 20 ఏళ్లుగా పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తూన్న లక్ష్మయ్య మురికి నీటి కాల్వ శుభ్రపరిచే క్రమంలో ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. సమాచారం తెలిసిన వెంటనే ఇఒ బాధితుడు ఇంటికి వెళ్లి రూ.ఐదు వేలు తన సొంత నిధులను అందించి మానవతను చాటుకున్నారు. కార్మికుడి పరిస్థితిని అర్థం చేసుకొని ఇతోధిక సాయాన్ని అందించిన ఇఒకు గ్రామ పంచాయతీ కార్మిక యూనియన్ నాయకులు, కార్మికులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పీలేరు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, యూనియన్ రాష్ట్రఅధ్యక్షులు ధనాసి వెంకట్రామయ్య, పీలేరు గ్రామ పంచాయతీ యూనియన్ అధ్యక్షులు బి.వి.రమణ, ప్రధాన కార్యదర్శి ఓబులయ్య, ప్రతాపరెడ్డి, సుబ్రమణ్యం, కార్మికులు పాల్గొన్నారు.



కార్మికుడికి ఆర్థిక సాయం అందిస్తున్న ఇఒ గురుమోహన్

ప్రభుత్వ వైద్యులకు భద్రత కల్పించాలి

- ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నందకిషోర్



మాట్లాడుతున్న ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నందకిషోర్

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వం వైద్యులకు భద్రత కల్పించాలని, వారిపై దాడులు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారతీయ వైద్యుల సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ నందకిషోర్ తెలిపారు. శనివారం నందకిషోర్, కార్యదర్శి డాక్టర్ సుభాష్ చంద్రబోస్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ సేవ కుమార్ బృందం పీలేరు భారతీయ వైద్యుల సంఘం శాఖను సందర్శించారు. స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో జరిగిన వైద్యుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ పీలేరు ఐఎంఎ శాఖ ప్రతి నెలా డాక్టర్లకు వైద్య విద్యలో అధునాతన చికిత్సలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తుండడం ప్రశంసనీయమని తెలిపారు. డాక్టర్లపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. కొత్త ఆసుపత్రులకు అనుమతులు ఇవ్వాలని తెలిపారు. పాత ఆసుపత్రుల అనుమతులు రెన్యూవల్ ప్రాసెస్ సులభ తరం చేయాలని కోరారు. మిక్సోపతిని ప్రోత్సహించకూడదని, అల్లోపతి వైద్య విధానంలోకి మిగిలిన వైద్య విధానాలను కలపకూడదని చెప్పారు. పీలేరు శాఖ ప్రారంభించిన ఏడాదిన్నర కాలంలోనే 69 మంది డాక్టర్లు ఐఎంఎ సభ్యులుగా చేరారని అందుకు కృషి చేసిన టీమ్‌ని ప్రశంసించారు. కార్యక్రమంలో భారత వైద్యుల సంఘం రాష్ట్ర వర్కింగ్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ పి.చంద్రశేఖర్, పీలేరు శాఖ అధ్యక్షులు డాక్టర్ మమతా లక్ష్మి, కార్యదర్శి డాక్టర్ పవన్ కుమార్, కోశాధికారి డాక్టర్ ఈశ్వర్ సురేంద్ర, డాక్టర్ రాజా సాహెబ్, డాక్టర్ శ్రీనివాస్ గుప్త, డాక్టర్ నాగవేణి, డాక్టర్ శివయ్య, డాక్టర్ రూపేష్ కుమార్‌రెడ్డి, డాక్టర్ హరీష్, డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, డాక్టర్ అలీమ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్

ప్రతి రైతుకూ ప్రత్యేక సంఖ్య : జెడి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని పెద్దమండ్యం, వాల్మీకిపురం, కలికిరి, గుర్రంకొండ మండలాలలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్ర నాయక్ అన్నారు. శనివారం స్థానిక రైతు సేవ కేంద్రలో సబ్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న రైతు సేవ కేంద్రాల సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి చంద్ర నాయక్ మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ, సమ్మర్ క్రాప్, మట్టి నమూనా సేకరణ, ఫార్మర్ రిజిస్ట్రేషన్ తదితర అంశాలను రైతు సేవ కేంద్రాల వారిగా సమీక్షించారు. ఈ సేవలు అన్నింటిని సకాలంలో పూర్తి చేయకపోతే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎడిఎ వాణిశ్రీ, ఎఒలు హేమలత, రమేష్ నాయక్, వెంకట మోహన్, నవీన్ కుమార్, సురేష్ బాబు, మమతారెడ్డి, రత్నమ్మ, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించాలి : వైసిపి

ప్రజాశక్తి-మదనపల్లె

అటవీ ప్రాంతాల్లో వేటగాళ్ళు ఉచ్చులు ఏర్పాటు చేస్తుంటే అటవీ అధికారులు నిద్రపోతున్నారా, అటవీ శాఖ అధికారుల వైఫల్యం వల్లే చిరుత పులి మృతి చెందితే రైతుల పై అక్రమ కేసులు పెట్టి వేదిస్తుంటే కూటమి ప్రభుత్వం ఏమి చేస్తోందని వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ప్రశ్నించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోన్నుటిపాళ్యం వద్ద చిరుతపులి మృతి ఘటన విచారకరమన్నారు. వేటగాళ్ళ వేసిన ఉచ్చుకు చిక్కుకున్న పులిని రక్షించడానికి అధికారులకు గ్రామస్తులు సహకరించిన రైతులపై కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికే ముగ్గురు రైతులను అరెస్టు చేయడమే కాకుండా మరో నలుగురు రైతులను అదుపులోకి తీసుకోవడం విచారకమన్నారు. గ్రామస్థులు ఏకపక్షంగా అరెస్టులను అడ్డుకున్న వినకుండా అరెస్టు చేయడం జరిగిందని, దీనిపై అటవి శాఖ మంత్రి స్పందించాలని కోరారు. సంబంధిత అటవీ అధికారులు తరచు గ్రామాలలో తిరిగి వన్యప్రాణులపై అవగాహన కల్పించాలన్నారు. రైతులు లక్షల రూపాయలు ఖర్చు పెట్టి పంటలు సాగు చేస్తే వాటి సంరక్షణ కోసం రైతుల నానా ఇబ్బందులు పడుతున్నారని ఇదే సమయంలో వన్యప్రాణులు నీటి కోసం పొలాల వైపు వస్తున్నాయి అయితే అటవీ ప్రాంతాల్లో అధికారులు తరచు తిరిగి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. అక్రమ అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని గాలివీడు రోడ్డు సందీప్‌నగర్‌లో శ్రీసీతాముల కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి, టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు సుగువాసి ప్రసాద్ బాబు హారజయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ సీతారాముల కరుణా కటాక్షాలుతో వర్షాలు సంవృద్ధిగా కురిసి ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రసాద్ బాబుకు పూలమాల వేసి కండువా కప్పి తీర్థప్రసాదాలు పూజారి అందజేశారు. కార్యక్రమంలో షబ్బీర్, పెరికల రెడ్డన్న, ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్ సహదేవ, ఎర్ర శివ, శివ, శ్రీనివాసులు, చలపతి, లక్ష్మినారాయణ, బడిశెట్టి రవి, వాకా వాసు, మన్నేరు రామాంజనేయులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో ప్రసాద్‌బాబు



పాఠశాల స్థలాన్ని పరిశీలిస్తున్న మధుసూదన్

పాఠశాలకు కేటాయించిన స్థలం పరిశీలన


ప్రజాశక్తి-కలకడ

బాలికల గురుకుల పాఠశాల నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పంచాయతీ రాజ్ డిఇ మధు సూదన్ పరిశీలించినట్లు ఎంపిడిఒ అబ్దుల్‌రహీం తెలిపారు. ప్రస్తుతం బాలికల గురుకుల పాఠశాలలో మం డల కేంద్రం కలకడ లోని అద్దె భవనంలో కొనసాగుతుండడం అన్నారు. గతంలో కలెక్టర్ మండ లాన్ని తని ఖీలు చేసే నిమిత్తంలో బాలికల గురుకుల పాఠశాలను తనిఖీలు నిర్వహించారు. కలెక్టర్ చేసిన తనిఖీలలో పాఠశాలకు కనీస సౌకర్యాలు లేవన్న విషయాన్ని గుర్తించి, ఈ పాఠశాల నిర్మాణానికి స్థలం ఎక్కడైనా ఉందా అని స్థానిక తహశీల్దార్ ఫణికుమార్‌ను ఆరా తీశారని అన్నారు. మండలంలోని దేవులపల్లి పంచాయతీ బొజ్జ గుంటపల్లికి చెందిన నారా చంద్రశేఖర్‌నాయుడు 6.25 ఎకరముల భూమిని పాఠశాల నిర్మాణానికి గతంలో ఇచ్చారని అన్నారు. మండల కేంద్రానికి దూరంగా ఉన్నట్లు గమనించి నిర్మాణాలు చేపట్టలేదని కలెక్ట ర్‌కు తెలి యజేశారని అన్నారు. కలెక్టర్ స్పందించి ఉదారి స్వభావంతో రైతు ఇచ్చిన ప్రాంతంలో బాలికల గురుకుల పాఠశాలను కట్టేందుకు అనుమతులను జారీ చేయడంతో శనివారం పంచాయతీరాజ్ డిఇ మధుసూదన్ వెళ్లి స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పిఆర్ఎఇ రూప్‌సాగర్ పాల్గొన్నారు.

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానించినట్లు ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. మండలానికి 9 యూనిట్లు మంజూరు కాగా, అందులో నిమ్మనపల్లి సప్తగిరి గ్రామీణ బ్యాంకు పరిధిలో చేపల పెంపకానికి రూ.3.50 లక్షలతో ఒక యూనిట్, ప్యాసింజర్ మూడు చక్రాల ఆటో రూ.3 లక్షలతో ఒక యూనిట్, ప్యాసింజర్ కారు రూ.10 లక్షలతో ఒక యూనిట్, వ్యవసాయంలో డ్రోన్ వినియోగానికి రూ.10 లక్షలతో ఒక యూనిట్, రెడ్డివారిపల్లి (మదనపల్లి) సప్తగిరి గ్రామీణ బ్యాంకు పరిధిలో పట్టు పరిశ్రమకు సంబంధించిన పట్టు ఉత్పత్తికి రూ.3.80 లక్షలతో ఒక యూనిట్, లగేజ్ వాహనం రూ.10 లక్షలతో ఒక యూనిట్, నిమ్మనపల్లి ఇండియన్ బ్యాంక్ పరిధిలో వర్మీ కంపోస్ట్ తయారీకి రూ.2.50 లక్షలతో ఒక యూనిట్, ప్యాసింజర్ మూడు చక్రాల ఆటో రూ.3 లక్షలతో ఒక యూనిట్, ప్యాసింజర్ నాలుగు చక్రాల ఆటో రూ.8 లక్షలతో ఒక యూనిట్ మంజూరు అయ్యాయని అన్నారు. లబ్ధిదారులు తీసుకున్న రుణం మొత్తంలో 5శాతం భరించాలని, 40 శాతం ప్రభుత్వం సబ్సిడీ పోగా, 55శాతం బ్యాంకుకు లబ్ధిదారులు కట్టాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు ఉన్న అభ్యర్థులు మే నెల 10వ తేదీలోగా అవసరమైన యూనిట్లను ఎంచుకొని ఎపిఒబిఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న దరఖాస్తు కాపీలను ఎంపిడిఒ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ఎస్‌సి రిజర్వేషన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. **కలకడ:** ఎస్‌సి కార్పొరేషన్ రుణాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం పేర్కొన్నారు. మే నెల 10 వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి వీలవుతుందని తెలిపారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకునే వారు ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన వారై ఉండాలని, కుల ధృవీకరణ పత్రం కలిగి ఉండాలని, లబ్ధిదారుడు ఆంధ్రప్రదేశ్‌కు చెందిఉండాలని, లబ్ధిదారుల వయోపరిమితి 21 నుంచి 50 ఏళ్ల ఉండాలని తెలిపారు. లబ్ధిదారుడు దారిద్ర్యరేఖకు దిగువన (బిపిఎల్) కేటగిరీ కింద ఉండాలని, స్వయం ఉపాధి పథకాల రవాణా రంగానికి లబ్ధిదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని,లబ్ధిదారునికి జనరిక్ ఫార్మసీ పథకాలకు డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ ఉండాలనిఉండాలని తెలిపారు. ఆధార్ కార్డు, ఆధార్ కార్డు లింక్ అయిన ఫోన్ నెంబర్, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రవాణాకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.



బత్యాల చెంగల్రాయుడును సన్మానిస్తున్న గిరిజనులు

రామాలయం ప్రారంభం

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని స్థానిక తిమ్మాయపాలెం గిరిజన కాలనీలో మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగల్రాయులు, ఆయన సొంత నిధులతో గ్రామస్తుల అభ్యర్థన మేరకు రామాలయాన్ని నిర్మించారు. శనివారం ఉదయం గిరిజన వాసుల ఆధ్వర్యంలో గ్రామంలో అంగరంగ వైభవంగా రామాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో దేవాలయాలు ఆదినించటం నా శక్తి మేర నిర్మించి ఇచ్చేందుకు కృషి చేసానని అన్నారు. ప్రధానంగా బడి, గుడికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చానని తెలిపారు. తిమ్మాయపాలెం గిరిజన గ్రామస్తుల దేవాల య నిర్మాణానికి సహకరించిన ఆయనకు గ్రామస్తులు మేళతాళాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-కలికిరి : మండలంలోని రేషన్ కార్డుదారులు ప్రతి ఒక్కరూ ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని సి ఎస్‌డిటి విజయ్‌కుమార్ తెలిపారు. శని వారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ షాప్ డీలర్లకు, ఎండియు ఆపే ఒంటర్లకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి ఈనెల 30వ లోపల కార్డులో పెం డింగ్ ఉన్న వారు ఇకెవైసి త్వరితగతిన పూర్తి చేయించాలని సూచించారు. మం డలంలో ఎండియు ఆపరేటర్లు, రేషన్ కార్డు దారులతో మర్యాద పూర్వకంగా మాట్లాడి పంచదార, కందిపప్పులపై ఎటువంటి పరిస్థితుల్లోనూ అదనంగా రుసుం వసూలు చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమించి వసూలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు, ఎండ ియు ఆపరేటర్లు పాల్గొన్నారు.

వైసిపి నేతలు ధర్నా చేపట్టడం సిగ్గుచేటు

ప్రజాశక్తి - వేంపల్లె :

వేంపల్లె మేజర్ పంచాయతీలో పాలక మండలి అంతా వైసిపి నేతలే ఉండి కూడా ధర్నా చేపట్టడం సిగ్గు చేటని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దొడ్డి దారిన వచ్చి మేజర్ పంచాయతీలో వైసిపి నేతలు పాలక మండలి సభ్యులుగా ఉన్నారని తెలిపారు. వైసిపి పాలనలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి పంచాయతీ ఆకౌంట్‌లో ఉన్న డబ్బులను చెక్ రూపంలో ఇవ్వకుండా నగదు రూపంలో ఇవ్వడం వల్ల ఇటీవల సస్పెన్షన్ అయ్యాడని తెలిపారు. వైసిపి నిర్వహకంతోనే అన్యాయంగా ఇఒ సస్పెండ్ అయ్యాడని చెప్పారు. సర్పంచ్‌కు చెక్ పవర్ కూడా రద్దయిందన్నారు. కూటమి నాయకులపై ఆరోపణలు చేయడం ఎంత వరకు సమంజసమని రామమునిరెడ్డి ప్రశ్నించారు. వేంపల్లెకు మంచి పంచాయతీ కార్యదర్శిని నియమకం చేపట్టాలని కలెక్టర్‌ను కోరామన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి నేతలు మహమ్మద్, వేమ కుమార్, డక్కా రమేష్, శివ పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వామ్యం అవుదాం



మదనపల్లి : జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-మదనపల్లె

స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతినెల మూడవ శనివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గ హెడ్ క్వార్టర్‌లో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాలని చేసిన ఆదేశాల మేరకు మదనపల్లె పట్టణం, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల ఆధ్వర్యంలో టిటిడి కల్యాణ మండపం నుంచి జడ్‌పి హైస్కూల్ వరకు స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషా, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, మున్సిపల్ చైర్ పర్సన్ వి.మానూజా రెడ్డి, తహసీల్దార్ ధనుంజయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మూడవ శనివారం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘాల, ఆర్‌పిలు, టిడిపి, నాయ ఎకులు, కార్యకర్తలు, మున్సిపల్ శాఖాధికారులు, పారిశధ్య కార్మికులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** మండల కేంద్రమైన నిమ్మనపల్లెలో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, టిడిపి మండలాధ్యక్షులు వెంకటరమణ, సుధాకర, ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులతో కలసి నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెల మూడవ శనివారం సందర్భంగా స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపడుతున్నామ అన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉర్దూ ఉన్నత పాఠశాల నుంచి స్థానిక బస్టాండ్ కూడలి వరకు మండల స్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి, ప్లాస్టిక్ వాడకం నిషేధంపై నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న వారిచే స్వచ్ఛ ఆంధ్రపై ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వాడకం మానవాళికి ముప్పు అని, ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిఒ రమేష్, ఆర్డబ్ల్యూఎస్ ఇఒ మిథున్ చక్రవర్తి, టిడిపి నాయకులు సుధాకర, చంద్రాయుడు, షఫీ, ఖాసీం ఖాన్, పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణ రెడ్డి, రాజేష్, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **నందలూరు :** ప్లాస్టిక్ కవర్ల నిషేధించడం మనందరి బాధ్యత అని సర్పంచ్ మోడపోతుల సుభాషిని, ఎంపిడిఒ రాధాకృష్ణంరాజు లు అన్నారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి సునీల్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఎంఇఒ నాగయ్య, హెచ్ఎం రౌఫ్ బాషా, మోడపోతుల రాముపాల్గొన్నారు. **కలకడ :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్రగా చేయడమే ప్రభుత్వం ఆశయంగా పెట్టుకుందని మండల ప్రత్యేక అధికారి నల్లపురెడ్డి భరత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామాలను, మండలాలను, పట్టణాలను, రాష్ట్రాన్ని స్వర్ణంగా మార్చు కోవాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశల కృషి చేస్తున్నదని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి కలకడ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, హౌసింగ్ కార్యాలయం సిబ్బంది, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు. **చిన్న మండెం :** మండల పరిధిలోని 13 గ్రామాలలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ, డిపిఒ, ఎంపిడిఒ శేఖర్‌నాయక్, ఎం ఇఒ శివా నాయక్, చిన్నమండెం మండల ప్రత్యేక అధికారి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ఉపాధ్యాయులు,వెలుగు ఎపిఎం రెడ్డమ్మ, సిబ్బంది, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. **రాజంపేట అర్బన్ :** స్వచ్ఛ ఆంధ్ర పాటిస్తే ఆరోగ్యాంధ్ర సాధ్యమని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్ఎస్ రోడ్డు మీదుగా స్వచ్ఛ ఆంధ్రర్యాలీలో పాల్గొన్నారు. సిఎం చంద్రబాబు పిలుపు మేరకు ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర, ఆరోగ్యాంధ్ర కోసం ప్రతి ఒక్కరూ నడు బిగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పీర్ మున్నీ, టిడిపి నాయకులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటువ్యాధులు రాకుండా అరికట్టవచ్చని పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయము నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో ఈ వేస్ట్ అనే అంశంపై మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎఒ శ్రీధర్‌రెడ్డి, ఎంఇఒ నాగ తిరుమలరావు, పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, టీచర్లు, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు. **చిట్వేలి :** మండల కేంద్రం చిట్వేలిలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం స్వచ్ఛఆంధ్ర, స్వర్ణాంధ్ర నినాదంతో ఎంపిడిఒ మోహన్, అధికారులు, ప్రజా ప్రతినిధులు తో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు ఎల్‌వి మోహన్‌రెడ్డి, చౌడవరం ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడడం వలన వాతావరణం కలుషితం కావడమే కాకుండా మానవాళి మనుగడకు ముప్పు ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎపిఎం చంద్రకళ, ఎపిఒ నాగరాజు పంచాయతీ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట:** మండలంలోని గట్టు జడ్‌పి హైస్కూల్‌లో ఎంపిడిఒ దిలీప్‌కుమార్‌నాయక్, నగర పంచాయతీ కమినర్ జివి.పల్లవి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాల గురించి ప్రజలు, విద్యార్థులకు నాటిక రూపంలో అవగాహ కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహణ, మానవహారం ,స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సిఐ జీవన్ గంగనాథ్ బాబు, ఎంఇఒ రెడ్డి శేఖర్, అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి, హెచ్ఎం లలితకుమారి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కలికిరి:** స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంపిడిఒ భానుమూర్తిరావు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక కలికిరి గ్రామం పంచాయతీ కార్యాలయంలో ఎంపిడిఒ భానుమూర్తి రావు ఆధ్వర్యంలో స్వచ్ఛంద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కు సహకరించాలని అధికారులను, ప్రజలను కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని, గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేసి స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ ఇఒ జి.అశోక్, సచివాలయం అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



పుల్లంపేట : ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

ఎస్‌సి వర్గీకరణ ఆర్డినెన్స్‌పై ఎంఆర్‌పిఎస్ సంబరాలు



స్వీట్లు తినిపించుకున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా ఎస్‌సి వర్గీకరణను అమలు చేసి, 59 ఎస్‌సి ఉపకులాలకు జనాభా దమాషా ప్రకారం న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జిఒ తేవడంతో బి.కొత్తకోట జ్యోతి చౌక్ వద్ద ఎంఆర్‌పిఎస్ నాయకులు భవాని వెంకటేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి సంబ రాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎస్‌పి జాతీయ నాయకులు సొట్ట నరేంద్ర బాబు మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 సంవత్సరాల మాదిగలకు జరిగిన అన్యా యాన్ని సరిదిద్దడానికై 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎంఆర్‌పిఎస్ చేసిన పోరాటం, స్వాతంత్రోద్యమం తర్వాత అంతటి గొప్ప ఉద్యమంగా నిలిచిందని అభివర్ణించారు. ఎన్నో సామాజిక ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలుస్తున్న ఈ విజయం వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు తపన, ఇచ్చిన మాటకి కట్టుబడి ఉండాలనే నిజాయితీ,నిబద్ధత ఉందన్నారు. ఎస్‌సి వర్గీకరణ అండగా నిలిచిన మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేకంగా ధన్యవాదములు తెలిపారు. ఎ,బి,సి,డి వర్గీకరణ విజయోత్సవ సంబరాలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు పాల్గొన్నారు.

ఆచరణాత్మక అనుభవం కోసమే బూట్ క్యాంపులు

- జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి

ప్రజాశక్తి- కలకడ

ఆచరణాత్మక అనుభవం కోసమే బూట్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్సు అధికారి మార్ల ఓబుల్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాల అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో శనివారం నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్న అటల్ బూట్ క్యాంప్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటల్ బూట్ క్యాంపుల ద్వారా విద్యార్థులలో ఆచరణాత్మక అభ్యాసం పెంపొందుతుందని అన్నారు. ఫలితంగా విద్యార్థులలో సృజనాత్మక, అన్వేషణాత్మక, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందు తాయని తెలిపారు. అటల్ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ బూట్ క్యాంపులలో విద్యార్థులు స్వయంగా ప్రాజెక్టులను రూపొందించి ఆచరణాత్మక అనుభ వాన్ని పొందుతారని అన్నారు. జిల్లాలోని మిగిలిన అటల్ టింకరింగ్ ల్యాబ్ లలో కూడా సమ్మర్ అటల్ బూట్ క్యాంపులను నిర్వహించి విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. ఎంఇఒ మునీంద్రనాయక్ మాట్లాడుతూ పేద, బడుగు, బల హీన వర్గాల విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధిని పెంపొం దింప చేయడానికి అనేక లక్షల రూపాయలు ఖర్చుపెట్టి అటల్ టింకరింగ్ ల్యాబ్ లను ఏర్పాటు చేశారని అన్నారు. వీటిని సక్రమంగా వినియోగించుకొని స్థానిక సమస్యలకు పరిష్కారం చూపే ప్రాజెక్టులను విద్యార్థులు రూపొం దించాలన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ మలాం షా మాట్లాడుతూ విద్యార్థులకు అటల్ ల్యాబ్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని అందుకే కలకడ విద్యార్థులు రెండుసార్లు జాతీయ స్థాయి సైన్స్ ప్రాజెక్టు పోటీలలో విజయ కేతనం ఎగరవేశారని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 రామచంద్రారెడ్డి, ట్రైనర్ రాజు, అటల్ ల్యాబ్ నోడల్ ఉపాధ్యాయులు సర్ఫుద్దీన్, శేఖర్, ప్రణవి,నలిని అటల్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఓబుల్ రెడ్డి

మోడల్ స్కూల్‌గా అనంతంపల్లె ఎంపిపి స్కూల్



గ్రామస్తులకు ప్రభుత్వ పాఠశాల గురించి వివరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్‌గా ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వచ్చే విద్యా సంవత్సరం 2025- 2026 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు ఈ మోడల్ స్కూల్‌లో చేర్పించాలని తెలిపారు. ఈ మేరకు వారు అన్ని గ్రామాలలో విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి మోడల్ స్కూల్లో చేర్పించి తమ బిడ్డల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తే కలిగే ప్రయోజనాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. ప్రయివేట్, కార్పోరేట్ స్కూల్‌లో మాదిరిగా ఎటువంటి ఫీజులు కట్ట వలసిన అవసరం లేదన్నారు. ప్రభుత్వమే నాణ్యమైన విద్యతో పాటు యూనిఫాం, పుస్తకాలను అందిస్తుందన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పౌష్టికాహారం అందిస్తుందని తెలియజేశారు. ప్రయివేట్ పాఠశాలకు భిన్నంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను విద్యార్థులకు అందించడం జరుగుతుందని అన్నారు. పిల్లల తల్లిదండ్రులు పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లను చేర్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు. పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు విద్యార్థులకు చదువుతో క్రీడలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు ధర్మేంద్ర, మునెమ్మ, ఆనంద్ పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- బి.కొత్తకోట

వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో యంగ్ ఇండియా ఫౌండేషన్ సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం పెద్దతిప్పసముద్రం, ఆర్‌టిసి బస్టాండ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు సంస్థ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధులు, కేన్సర్, దీర్ఘకాలిక కీళ్ళ , ఎముకల నొప్పితో బాధపడుతున్న వారికి వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని ప్రముఖ వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. దాదాపుగా 200 మందికి చికిత్స చేయగా ఇందులో వివిధ జబ్బులగల వారు 30 మందికి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని వైదేహి ఆసుపత్రి వైద్యులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ అధ్యక్షులు రాజశేఖర్,జాయింట్ సెక్రటరీ మిండిగళ్ళ లక్ష్మణ్ సభ్యులు సూరి, రెడ్డిబాషా, అనిల్, రామాజులు, నాయకులు తలారి మంజునాథ్, గిరి స్వామి స్కూల్ కమిటీ చైర్మన్ నరసింహులు, పోలీస్ సిబ్బంది ఎస్.బావాజన్, ఎఎన్ఎంలు రామకృష్ణమ్మ, ఆశా వర్కర్స్ సులోచన, భూదేవి, శైలజ, శాంతకుమారి పాల్గొన్నారు.

జడ్‌పి హైస్కూల్‌లో విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి జడ్‌పి హైస్కూల్, బాలికల జూనియర్ కళాశాలలో నూతనంగా ప్రతిష్టాపించిన విజయగణపతి, జ్ఞానసరస్వతీదేవి విగ్రహాలను శనివారం ఆవిష్కరించారు. పాఠశాల , జూనియర్ కళాశాలలోని బాలబాలికలకు చదువులలో మంచి విజయాలను ప్రసాదించాలని కోరుతూ విజయ గణపతిని, జ్ఞానానికి ప్రతీక అయిన జ్ఞాన సరస్వతి దేవిని ఇక్కడ నెలకొల్పినట్లు ప్రధానోపాధ్యాయులు జయలలిత కుమారి తెలిపారు. శిల్పి ఆనందచారి రాజేశ్వరి దంపతులు విజయ గణపతి విగ్రహాన్ని, విశ్రాంత ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ మీసరగండ నాగేంద్రప్రసాద్ శ్రీదేవి దంపతులు జ్ఞాన సరస్వతి దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. వేద పండితులు శాస్త్రోక్తంగా రెండు విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖాదర్‌బాషా, గంగనపల్లి వెంకటరమణ, వెంకటసుబ్బయ్య, లక్ష్మీనారాయణ, రవిశంకర్ రెడ్డి, మస్తాన్, తులసీ స్వర్ణలత, గౌరీ, గీతా, రమణమ్మ, జీ.వి. ప్రసాదరావు, పాలేటి సుబ్బరా యుడు, ఆర్.వి. రమణమ్మ, వెంకటరమణ, పెంచలయ్య, షాకీర్ హుస్సేన్, విద్యార్థులు పాల్గొన్నారు.



హోంగార్డు భార్యకు నగదును అందిస్తున్న పోలీసులు

అనారోగ్యంతో హోంగార్డు మృతి

- సంతాపం వ్యక్తం చేసిన ఎస్‌పి

ప్రజాశక్తి-సుండుపల్లి: రాజంపేట సబ్ డివిజన్ పోలీసు అధికారి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హెూంగార్డు శివకుమార్ అనారోగ్యంతో సెలవులో ఉన్నారు. సుండుపల్లిలో తన ఇంట్లో శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. హోంగార్డు మృతి పట్ల ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.వారి కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటామని భరో సా ఇచ్చారు. సుండుపల్లి ఎస్ఐ. యం.శ్రీనివాసులు, రిజర్వ్ సిఐ బి.అమరనాథ్ రెడ్డి, రాజంపేట సబ్ డివి జన్ హెూంగార్డు ఇన్‌ఛార్జి వి.లక్ష్మిరెడ్డి, పోలీసు సిబ్బంది, సహోద్యోగులు విచారం వ్యక్తం చేశారు. మృతునికి భార్య నవ్యసుధ, కుమారులు యోగేష్, ధనుష్ ఉన్నారు. ఎస్‌పి ఆదేశాల మేరకు పోలీసు అధికారులు హోంగార్డు శివకుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి, దహన సంస్కారాల నిమిత్తం రూ.20వేలు నగదును ఆయన సతీమణి నవ్యసుధకు అందించారు.

పంచాయతీ సిబ్బందికి అందని జీతాలు

ప్రజాశక్తి - వేంపల్లె : కూటమి ప్రభుత్వ అసమర్థత పాలనతో గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేదని వైసిపి మండల అధ్యక్షులు చంద్రఓబుల్ రెడ్డి, ఉపాధ్యక్షులు మునీర్, రవిశంకర్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వైసిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 5 నెలలుగా పారిశుధ్య కార్మికులకు కూటమి ప్రభుత్వం జీతాలు చెల్లిం చకపోవడంతో డ్రెయినేజీ, పారిశుధ్య వ్యవస్థలు అస్తవ్యస్తంగా తయారయ్యాయని తెలిపారు. ఇఒ వెంకటసుబ్బారెడ్డి, ఇద్దరు సిబ్బందిని రెండు నెలల క్రితం సస్పెండ్ చేశారన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులకు, పారిశుధ్య కార్మి కులకు జీతాలు చెల్లించలేదన్నారు. మేజర్ పంచాయతీ అయిన వేంపల్లెలో కూటమి నాయకులు ఆధిపత్యంతో ఇప్పటివరకు ఇఒను నియమించకుండా గ్రామపంచాయతీని భ్రష్టు పట్టించారని తెలిపారు. ఇంత జరుగుతున్నా ఇన్‌ఛార్జిగా ఉన్న డిఎల్‌పిఒ రమాదేవి, ఉన్నతాధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. తక్షణమే అధికారులు స్పందించి కొత్త ఇఒను నియమించి, పారిశుధ్య కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

లారీ, బైక్ ఢీ : వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రమాదాలకు నిలయమైన కడప-రేణిగుంట జాతీయ రహదారిలో మరోసారి రోడ్డు ప్రమాదం జరగడంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. ఓబులవారిపల్లి మండలం చిన్నంపల్లి గ్రామానికి చెందిన దాసానపు శ్రీనివాసరాజు ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన సొంత పని నిమిత్తం రాజంపేటకు బైక్ పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో కాలు నుజ్జు నుజ్జు అయింది. తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాసరాజును వెంటనే రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి సంకల్ప ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

బెల్ట్ షాపు నిర్వాహగుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మండలంలోని ఏనుగొండపాలెం పంచాయతీ గొల్లపల్లిలో బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడులలో గొల్లపల్లికి చెందిన సుబ్బారి మల్లికార్జున కుమారుడు సుబ్బారి సురేష్ బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నట్లు గుర్తించామని అన్నారు. బెల్ట్ షాప్‌లో 74 క్వార్టర్ మద్యం బాటిళ్లు, ఎనిమిది బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సురేష్ ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.